క్లుప్తంగా

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు
వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు



ఇబ్రహీంపట్నం: మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు వాహనదారులకు సూచించారు. ఇబ్రహీంపట్నంలో సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ ఎస్. లక్ష్మణరావు నిర్వహించిన వాహనాల తనిఖీని గురువారం ఆయన పర్యవేక్షించారు. పలు ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనాలు నడిపే సమయంలో సంబంధిత రికార్డులు, లైసెన్స్, యూనిఫాం తప్పనిసరిగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పెండింగ్ చలానాలను తక్షణం చెల్లించాలన్నారు. రికార్డులు సక్రమంగా లేని 25 వాహనాలకు జరిమానా విధించారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఇంకుడు గుంత



జి.కొండూరు: చెర్వుమాధవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణంలో ఇంకుడు గుంత కోసం మూడు నెలల కిందట తవ్విన గుంత ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి రాకపోయినప్పటికీ ఈ కేంద్రాన్ని అనుకొని ఉన్న ఇళ్లల్లోని పిల్లలు ఆడుకునేందుకు గుంత చుట్టూ తిరుగుతున్నారు. ఈ గుంత ఏడు అడుగుల మేర లోతు ఉండడంతో పాటు వర్షానికి గుంత నిండా నీరు చేరింది. పిల్లలు గుంత వద్ద ఆటలాడుకుంటుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరుగక ముందే అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు వేశారు.. అప్రోచ్ మరిచారు



జి.కొండూరు: కందులపాడు, గంగినేని స్టేట్ హైవే విస్తరణ పనుల్లో భాగంగా జి.కొండూరు బీసీ కాలనీ వద్ద సీసీ రోడ్డును ఇటీవల నిర్మించారు. బీసీ కాలనీ మూడో రోడ్డు నుంచి హైవేకు వచ్చేందుకు అప్రోచ్ వేయకపోవడంతో కాలనీ వాసులు నరకయాతన పడుతున్నారు. రహదారి పనులు ప్రారంభించినప్పటి నుంచి గత మూడు నెలలుగా ఈ వీధిలో నివాసం ఉండే కుటుంబాలు హైవేకు వచ్చే వీలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అప్రోచ్ లేకపోవడంతో సీసీ రోడ్డు పక్కగా మార్జిన్‌లో ద్విచక్ర వాహనాలను నడుపుతూ అదుపు తప్పి పక్కనే ఉన్న డ్రెయినేజీ గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి అప్రోచ్ నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి పనులను పర్యవేక్షించాలి



నూజివీడు: మండలంలో నిర్వహించే ఉపాధి హామీ పథకం పనుల్లో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగకుండా పర్యవేక్షించాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు పనికి వచ్చిన కూలీలకు మాత్రమే హాజరు వేయాలన్నారు. కొలతల ప్రకారం మాత్రమే కూలి డబ్బులు చెల్లించాలని చెప్పారు. ఎక్కడైనా అక్రమాలు జరిగినట్లు తెలిస్తే సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఓ మీనాక్షి, ఈసీ శ్యామ్, టీఏలు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు

నూజివీడు: మండలంలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు లభించాయని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ తెలిపారు. తుక్కులూరు కార్యదర్శి సి. చంద్రిక గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3కి పదోన్నతి కల్పించి అన్నవరం కార్యదర్శిగా బదిలీ చేశారు. అలాగే పోతురెడ్డిపల్లి కార్యదర్శి బి. చంద్రశేఖర్‌ను కూడా గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3 కి పదోన్నతి కల్పించి అక్కడే పోస్టింగ్ ఇచ్చారు.

తరగని అభిమానం

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటికి విచ్చేశారు. మాజీ మంత్రి జోగి రమేష్, శకుంతలాదేవి కుమారుడు జోగి రాజీవ్ వివాహ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్ జగన్ వస్తున్న విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఫెర్రి రోడ్డుకు భారీగా చేరుకున్నారు. రింగ్ సెంటర్ నుంచి ఫెర్రి వరకు రోడ్డు కిక్కిరిసిపోయింది. అభిమాన నేతను చూసి ఆనందంతో ప్రజలు చేసిన జై జగన్ నినాదాలు మిన్నంటాయి. – ఇబ్రహీంపట్నం







వర్షాకాలం..నరకప్రాయం

- లంక గ్రామాలకు సరైన రోడ్డు లేక ఇబ్బందులు
- చినుకపడితే బురదగా మారుతున్న రోడ్డు
- వర్షాకాలం సమీపించడంతో భయాందోళన
- చినలంక, పెదలంక గ్రామాలకు రహదారి కష్టాలు



ఇటీవల కురిసిన వర్షాలకు బురదగా మారిన పెదలంక, చినలంక గ్రామాలకు వెళ్లే రహదారి



వర్షాకాలంలో ఉబ్బడివాగు నీటి ప్రవాహంలో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న లంక గ్రామాల ప్రజలు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: వ్యవసాయాన్ని జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న చినలంక, పెదలంక గ్రామాల ప్రజలకు సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ప్రధాన రహదారి చిత్తడిగా మారి రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. గ్రామాలు ఏర్పడి సుమారు 180 ఏళ్లు అవుతున్నా సరైన రహదారిని ప్రభుత్వాలు నిర్మించలేదు. ఈ రెండు గ్రామాల ప్రజలు వివిధ పనులపై జూపూడి వద్ద 60వ నంబర్ జాతీయ రహదారికి వచ్చి ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. ప్రజలు అనారోగ్యానికి గురైతే రవాణా సౌకర్యం లేక ట్రాక్టర్లు, బైకులపై వైద్యశాలకు తీసుకువెళ్లాల్సి వస్తోంది. వర్షాలతో రోడ్డు గుంతలమయంగా మారింది.

వర్షాకాలంలో చిత్తడిగా రోడ్డు

చినలంక, పెదలంక గ్రామాలకు ఐదు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి వర్షాకాలంలో చిత్తడిగా మారుతోంది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణానది గర్భం కావడంతో కొద్దిపాటి వర్షానికి ఇసుక బంకమట్టి కలిసిన నేల బురదమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతోంది. రెండు గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లపై ప్రజలు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ప్రయాణాల్లో బైకులు జారి పడి అనేక మంది గాయాల పాలైన ఘటనలు ఉన్నాయి. పెదలంక గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి పరిధి, చినలంక ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామ పరిధిలో ఉన్నాయి. రెండు గ్రామాల జిల్లాలు వేరైనప్పటికి వీరి దైనందిన జీవనం ఎన్టీఆర్ జిల్లాతో ముడిపడి ఉంది. నదీపరీవాహక ప్రాంతం కావడం వలన రోడ్డు వేసేందుకు సంబంధిత అధికారులు ముందుకు రావడంలేదని ప్రజలు చెబుతున్నారు.

కొద్దిపాటి వరదకే పొంగుతున్న ఉబ్బడి వాగు

వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వర్షం నీటికి ఉబ్బడి వాగు పొంగి ప్రవహిస్తుంటుంది. కృష్ణానది నుంచి చీలిన పాయ కూడా ఉబ్బడి వాగులో కలవడం వలన ఎగువ నుంచి రెండు లక్షల క్యూసెక్కుల వరద వస్తే వాగు పొంగి ప్రవహిస్తుంది. సుమారు అర కిలోమీటరు వెడల్పు, నాలుగు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహించి రాకపోకలను స్తంభింపజేస్తుంది. అత్యవసర పనులపై చినలంక ప్రజలు జూపూడి వద్దకు, పెదలంక ప్రజలు ఇబ్రహీంపట్నం ఫెర్రీ రేవు వద్దకు పడవల ద్వారా చేరుకుంటారు. చినలంక వద్ద ఉబ్బడివాగుపై హైలెవల్ సప్తా నిర్మించి రహదారి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును అభివృద్ధి చేయాలి



పెదలంకలో సుమారు 160 కుటుంబాల వారు నివశిస్తున్నారు. పూర్వీకుల నుంచి మాతరం వరకు 180 ఏళ్లగా వ్యవసాయంపై ఆధారపడ్డాం. ఇన్నేళ్లగా మా గ్రామానికి సరైన రోడ్డ మార్గం లేదు. ఉన్న రోడ్డు వర్షాకాలంలో చిత్తడిగా మారి రాకపోకలకు అవకాశం లేకుండా పోతోంది. రహదారిని అభివృద్ధి చేయాలి.

– దాసరి అంబేద్కర్, రైతు, పెదలంక

హైలెవల్ సప్తా నిర్మించాలి



చినలంక, పెదలంక గ్రామాల్లో వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాం. వర్షాకాలంలో వ్యవసాయ ఉత్పత్తులు, పాలు మార్కెట్‌కు తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్డు మార్గం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉబ్బడి వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలి.

– బొమ్మడి శ్రీను, పాల వ్యాపారి, చినలంక

వ్యవసాయమే జీవనాధారం

లంక గ్రామాల ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయాన్ని నమ్ముకుని 180 ఏళ్లగా నాలుగు తరాల ప్రజలు ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. సుమారు రెండు వేల ఎకరాల్లో వాణిజ్య, ఉద్యాన పంటలు పండిస్తారు. వరదలు, తుఫాన్ల వంటి ప్రకృతి విపత్తులు వచ్చినా లంక గ్రామాలను విడిచి బయటకు వెళ్లరు. గ్రామాలకు వరదనీరు చేరిన సమయాల్లో కూడా మెరక ప్రాంతాల్లో పశువులు, జీవాలను ఉంచి భవనాలపై పట్టాలు కప్పుకుని వారు ఉంటారు. గతేడాది ఆగస్టులో వచ్చిన భారీ స్థాయి వరద ముంపుతో అధికారుల ఒత్తిడి మేరకు వారు సహాయక శిబిరాలకు చేరారు.

అభివృద్ధి పనులకు జెడ్పీ నిధులు మంజూరు

నూజివీడు: కృష్ణాజిల్లా పరిషత్ నుంచి మండలంలోని పలు అభివృద్ధి పనులకు రూ.1.28 కోట్ల జెడ్పీ నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ చెన్నా రాఘేంద్రనాథ్ తెలిపారు. మండలంలోని ఎంఎన్‌పాలెం, జంగంగూడెం, మర్రిబంధం, రామన్నగూడెంలలో సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి రూ.4 లక్షల చొప్పున మంజూరయ్యాయన్నారు. రేగుంటలో సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి రూ.24.10 లక్షలు, బోర్వంచ, దిగవల్లి, ముక్కొల్లుపాడు, యనమదల పంచాయతీల్లో సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి రూ.4.90 లక్షలు, పోలసానపల్లికి రూ.4 లక్షల చొప్పున మంజూరయ్యాయని చెప్పారు. మీర్జాపురంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మీర్జాపురానికి రూ.12.30 లక్షలు, తూర్పు దిగవల్లికి రూ.4.50 లక్షలు, సుంకొల్లులోని ఎస్సీ ఏరియాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20 లక్షలు, పోతురెడ్డిపల్లి ఎస్సీ ఏరియాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయన్నారు. అంతర్గత రోడ్లను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు బోర్వంచకు రూ.4 లక్షలు, పోలసానపల్లికి రూ.4 లక్షలు చొప్పున మంజూరయ్యాయని వివరించారు.

నేడు పవిత్ర సంగమం వద్ద క్రీడా పోటీలు

ఇబ్రహీంపట్నం: యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకుని కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద వివిధ రకాల యోగా, ఆటల పోటీలు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తామని యోగా గురువు లంకే జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సును బట్టి మూడు విభాగాలుగా క్రీడలు నిర్వహిస్తామన్నారు. సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ఆర్టిస్టిక్ యోగా, పాటలు, పెయింటింగ్, స్కిట్, క్విజ్ తదితర పోటీలు జరుగుతాయని చెప్పారు. మరిన్ని వివరాల కోసం సెల్: 63014 54859 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చాట్రాయి: మంచి ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. గురువారం చాట్రాయిలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. యోగా శిక్షణ కోసం ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ కమల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

- ఆగిరిపల్లి: ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ ఆనంద్‌బాబు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి యోగాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు, ప్రశాంత జీవనాన్ని గడిపేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ గంటసేపు యోగా చేస్తే వారి ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఏఓ అబ్దుల్ సలాం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చాట్రాయిలో ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఎండీయూ ఆపరేటర్ల నిరసన

మైలవరం: ఎండీయూ వ్యవస్థను రద్దు చేయవద్దంటూ మైలవరం పట్టణంలో ఎండీయూ ఆపరేటర్లు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎండీయూ వాహనాల రద్దు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అబ్దుల్ దరియాకు అందజేశారు. కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

తిరువూరు: జాబ్ మేళా కార్యక్రమం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాలో పలు ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ తదితర కోర్సులు చదివిన వారు తమ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు.

పుస్తక పఠనం పెంపొందాలి



తిరువూరు: విద్యార్థులు చిన్ననాటినుంచి పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోవాలని తిరువూరు గ్రేడ్-1 శాఖా గ్రంథాలయాధికారి కొరివి పద్మావతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో పాల్గొనే విద్యార్థులకు ప్రతి రోజూ పుస్తక పఠనం చేసే విధంగా షెడ్యూలు రూపొందించామని చెప్పారు. వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్లు, టీవీలకు అలవాటు పడకుండా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని చెప్పారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు, గ్రామర్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

ప్రజా సేవల్లో జాప్యం వద్దు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న వసంత కృష్ణప్రసాద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ సిబ్బంది ప్రజలకు అందించే సేవల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న సేవలపై గురువారం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంచుకుని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనకు అవసరమైన వివిధ అంశాలలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అధికారులు లక్ష్యాల మేరకు విస్తృతంగా సేవలు అందించాలని సూచించారు. అధికారులు పాల్గొన్నారు.

నమస్తే పథకంపై అవగాహన

ఇబ్రహీంపట్నం: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ నిర్వహిస్తున్న నమస్తే పథకం చిత్తు కాగితాలు, తలనీలాలు సేకరించే పేదలు సద్వినియోగం చేసుకోవాలని స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో నమస్తే కార్యక్రమంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తుకాగితాలు, తలనీలాలు సేకరించే వారికి నమస్తే పథకం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, డీబీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమాదేవి, సిటీ కో-ఆర్డినేటర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

2న ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలంలో సుదీక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చిగురుపాటి విమల ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేస్తామని చెప్పారు.

డాక్యుమెంట్స్ పోయినవి

కొలుసు ఆరేటిబాబు, S/o. సాంబశివరావు, (ఆధార్ నెంబర్ 4450 7022 4391) ఎన్.టి.ఆర్. జిల్లా, రెడ్డిగూడెం మండలం, నాగులూరు గ్రామమునకు చెందిన నా భూమి యొక్క విక్రయ దస్తావేజు నెం. 3333/2011, సర్వే నెం. 205/7లో 1.50 సెంట్లుకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ ది. 25-5-2025న నాగులూరు గ్రామం నుండి రెడ్డిగూడెం వెళ్ళే మార్గం మధ్యలో పోయినవి. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు. సెల్: 97057 63513.

వారికో న్యాయం.. మాకో న్యాయమా?



కొత్తగూడెంలో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

చాట్రాయి: మట్టి తోలకాలకు రాజకీయ అడ్డంకులు ఏర్పడుతుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వర్షాకాలంలో ఇంటి ముందు నీళ్లు నిలుస్తుండటంతో మట్టి తోలుకుంటుంటే వైఎస్సార్ సీపీ మద్దతుదారులంటూ అధికారులు అడ్డుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులు మట్టి తోలుకుంటుంటే అధికారులు పట్టుకుని జరిమానా విధిస్తున్నారు. అదే టీడీపీ వాళ్లు తోలుకుంటే ఎలాంటి చర్యలు ఉండడంలేదు. మాకొక న్యాయం.. వాళ్లకొక న్యాయమా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకే..

మండలంలోని కొత్తగూడెం సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరావు బుధవారం తన తోటలోకి మట్టిని తరలిస్తుంటే రెవెన్యూ అధికారులు పట్టుకుని జరిమానా విధించారు. గురువారం అదే గ్రామంలో టీడీపీ వాళ్లు మట్టిని తరలిస్తుంటే రెవెన్యూ అధికారులు చేతులెత్తేశారు. ఇటీవల చిన్నంపేట, కృష్ణారావుపాలెం గ్రామాల్లో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టి వ్యాపారం జోరందుకుంటోందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. వ్యవసాయ భూములకు మట్టిని తరలించవచ్చని ప్రభుత్వం కోర్టులు ఆదేశాలు ఇచ్చినా స్థానిక అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి వైఎస్సార్ సీపీ వాళ్ల మట్టి తోలకాలను అడ్డుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కొందరికే అనుమతులు..

మండలంలో చాలా మందికి పశువుల కొట్టాలకు, కొత్త ఇళ్ల ముందు మెరక చేసుకోవడానికి మట్టి అవసరం ఉన్నప్పటికి కొంతమందికే అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా అవసరాల కోసం మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చేందుకు అధికారులు ప్రభుత్వం ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఢిల్లీకి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఢిల్లీలోని శ్రీధృయీ నృత్య కళానిలయానికి చెందిన విద్యార్థులు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్యాచార్య అయ్యనా ముఖర్జీ పర్యవేక్షించారు. భక్తులు చిన్నారుల నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.

పది వారాలుగా వేతన బకాయిలు పెండింగ్

తిరువూరు: ఉపాధి హామీ పథకంలో పనిచేసే తమకు పది వారాలుగా వేతనాలు చెల్లించలేదని ఎ.కొండూరు మండలం చీమలపాడులో కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి. శివనాగరాణి ఎదుట వాపోయారు. ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకునేందుకు ఆమె గురువారం చీమలపాడులో పర్యటించారు. కూలీల మస్టర్లలో జరుగుతున్న మాయాజాలంతో అసలు పనిచేసిన వారికి నష్టం జరుగుతోందని, పనికి రానివారికి సైతం ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు నమోదు చేస్తున్నారని కూలీలు ఆరోపించారు. వారంలో ఆరు రోజులు పనిచేస్తే నాలుగు రోజులకే మస్టరు వేయడంతో తాము నష్టపోతున్నామన్నారు. పని ప్రదేశంలో కూలీలకు కనీస సదుపాయాలు లేవని, ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతో కూలీలకు అన్యాయం జరుగుతోందని శివనాగరాణి దృష్టికి తీసుకువచ్చారు. కూలీల సమస్యలపై తమ సంఘం పోరాడుతోందని హామీ ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు గాంధీ, నాగేశ్వరరావు, రమేష్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.